పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం


నాగిడిపాలెంలో మూలన పడ్డ పారిశుద్ధ్య రిక్షాలు


దొంగపిండిలో ధ్వంసమవుతున్న వర్మీకంపోస్టు షెడ్డు


దొంగపిండిలో గ్రామానికి వెళ్లకముందే స్వాగతిస్తున్న చెత్త కుప్పలు

- కాలువ గట్లు, రోడ్ల పక్కన చెత్త డంపింగ్
- మూలన పడ్డ పారిశుద్ధ్య రిక్షాలు

భీమవరం అర్బన్: గ్రామాల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో పారిశుద్ధ్యం పడకేసింది. దీంతో దుర్గంధంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా దోమలు ప్రబలడంతో రాత్రులు స్వైర విహారం చేయడంతో కంటి మీద కునుకు లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భీమవరం మండలంలోని యనమదుర్రు, దిరుసుమర్రు, రాయలం, దొంగపిండి, అనాకోడేరు, కొమరాడ, కొత్తపూసలమర్రు, గూట్లపాడు, నాగిడిపాలెం, దెయ్యాలతిప్ప తదితర గ్రామాల్లో ఇళ్లలో వాడి పడేసిన వ్యర్థాలు సుమారు 25 టన్నులకు పైగా వస్తుందని ప్రాథమిక అంచనా. గ్రామాల్లో పారిశుద్ధ్యం రిక్షాల ద్వారా చెత్తను ఒక చోటకు చేర్చేవారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తడి, పొడి చెత్తను వేరు చేసి వర్మీకంపోస్టు తయారు చేయాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అంతే కాకుండా పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరించి తీసుకెళ్లేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో ఇళ్లలో వాడి పడేసిన వ్యర్థాలు, ప్లాస్టిక్ పేరుకుపోయి దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్వచ్ఛ భారత్ ఎక్కడ ?

స్వచ్ఛ భారత్, ప్లాస్టిక్ నిర్మూలించడం వంటి కార్యక్రమాలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో ఏ గ్రామం వెళ్లినా రోడ్ల వెంబడి, పంట కాలువల పక్కన ఇళ్ల సమీపాన చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్తను తరలించే రిక్షాలు, ఎలక్ట్రిక్ వాహనాలు మూలన పడటంతో పంచాయతీ కార్యదర్శులు, పాలకవర్గ సభ్యులకు చెత్త పట్ల చిత్త శుద్ధి లేదని పలువురు విమర్శిస్తున్నారు.

నిరుపయోగంగా వర్మీకంపోస్టు షెడ్లు

ప్రభుత్వం చెత్త నుంచి సంపద సృష్టించొచ్చని ప్రతి గ్రామంలో వర్మీకంపోస్టు షెడ్లు కోట్లాది రూపాయలతో నిర్మించారు. అవి నిర్మించి సుమారు 8 సంవత్సరాలు కావడంతో ధ్వంసమవుతున్నాయి. చెత్త నుంచి సంపద ఏమో కాని కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా సంపద సృష్టి కేంద్రాలు ఆకతాయిలకు అసాంఘిక కార్యకలాపాలు, పేకాటలకు ఉపయోగ పడుతున్నాయని పలువురు బాహాటంగానే చెబుతున్నారు. ఇప్పటికైనా గ్రామాల్లో చెత్తను తొలగించి వర్మీకంపోస్టు షెడ్లను ఉపయోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

క్లుప్తంగా

కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఆరిమిల్లి అభినందనలు


కలెక్టర్ నాగరాణిని అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఇటీవల రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్న సందర్భంగా బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కలిసి శాలువాతో సత్కరించి, పూల బొకే అందజేసి అభినందనలు తెలిపారు. ఈ అవార్డు ఆమె సేవా భావానికి, మానవతా కార్యక్రమాలపై ఉన్న నిబద్ధతకు గుర్తింపుగా నిలుస్తోంది అన్నారు.

వ్యభిచారం కేసులో నలుగురి అరెస్ట్

భీమవరం: పట్టణంలోని లాడ్జిలో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసి ముగ్గురు విటులు, ఒక మహిళపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు బుధవారం చెప్పారు. పట్టణంలోని కొత్తబస్టాండ్ ప్రాంతంలో ఎస్ఆర్‌కే లాడ్జిలో వ్యభిచారం జరుగుతుందని మంగళవారం రాత్రి సమాచారం రావడంతో తన సిబ్బందితో దాడి చేసి, నలుగురిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు సీఐ నాగరాజు చెప్పారు.

చలివేంద్రాలు ప్రారంభం

కాళ్ల: పెదఅమిరం గ్రామంలో రతన్ టాటా విగ్రహం వద్ద గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, కోరా రామ్మూర్తి, ఉపసర్పంచ్ జవ్వాది కిషోర్, పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర, నడింపల్లి సుబ్బరాజు, రాఘవేంద్రరావు, పద్మనాభం, తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో..

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీమావుళ్లమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ చలి వేంద్రాన్ని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) బుధవారం ప్రారంభించారు. రావాడ రామ్మోహన్‌రావు, వరలక్ష్మి దంపతులు (శ్రీవిజయ కిరణ్ బయోటెక్ భీమవరం) దాత సహకారంతో మజ్జిగ చలి వేంద్రాన్ని దేవస్థానం ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్, కోళ్ల నాగేశ్వరరావు, కారుమూరి సత్యనారాయణమూర్తి, రావాడ రామ్మోహన్‌రావు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు అభినందనలు

నరసాపురం: మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య సేవలకు తగిన గుర్తింపు లభించిందని వార్డు సచివాలయ ఉద్యోగులు పేర్కొన్నారు. కమిషనర్ అంజయ్య గ్రేడ్‌-1 మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వార్డు సచివాలయ ఉద్యోగులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు సంఘం నరసాపురం శాఖ అధ్యక్ష, కార్యదర్శులు టి.సుబ్బలక్ష్మి, పులగండం వాసు, కూనా ప్రభుజీ, కృష్ణవంశీ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 22 మంది ఎంపిక

నరసాపురం: స్థానిక వైఎన్ కళాశాల హెచ్ఆర్డీ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 22 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు తెలిపారు. ఎంబీఏ, డిగ్రీ విద్యార్థులకు ఏపీఎస్ఎస్డీసీ, ఎన్‌సీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలకు 85మంది హాజరయ్యారు. ఎల్అండటీ ఫైనాన్స్, ఏపీపీసీ ఫైనాన్షియల్ సర్వీస్ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించారు. హెచ్ఆర్డీ సెంటర్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

పెనుగొండ: ఇల్లు లేని అర్హులైన పేదలు ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని పెనుగొండ తహసీల్దారు జి.అనితకుమారి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. సచివాలయంలోనూ, తహసీల్దారు కార్యాలయంలలో గానీ దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. అర్హులైన వారికి మూడు సెంట్లు స్థలం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిందని పేర్కొన్నారు. ఆధార్ కార్డు, ఫొటో గుర్తింపు కార్డు, రేషన్ కార్డు దరఖాస్తుకు జత చేయాలని స్పష్టం చేశారు. గురువారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని, స్థలాలు అవసరమైన దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు అవగాహన

అత్తిలి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు గణిత చమత్కారాలు, జనరల్ నాలెడ్జ్‌పై రిసోర్సుపర్సన్ బి శ్రీనివాస్ శిక్షణ ఇచ్చారు. ప్లాస్టిక్‌వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ బయటకు వెళ్లేటప్పుడు గుడ్డసంచులు, జూట్ సంచులను వినియోగించాలన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో వెస్ట్‌బెర్రీ హవా


హంసిక వల్లి


లక్షిత


మన్విత


హసిని


పుష్పిత వల్లి


ప్రజ్ఞశ్రీ

భీమవరం: సీబీఎస్ఈ బోర్డు పరీక్షల్లో భీమవరం వెస్ట్‌బెర్రీ హైస్కూల్ విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించారని స్కూల్ యాజమాన్యం విలేకరులకు తెలిపారు. మంగళవారం విడుదలైన టెన్త్, ఇంటర్ బోర్డు పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు అసాధారణ విజయాన్ని సాధించారన్నారు. టెన్త్ ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించగా 33 శాతం మంది విద్యార్థులు 90 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించడం విశేషమన్నారు. వీరిలో ఆళ్లూరి హంసిక వల్లి 589 మార్కులతో స్కూల్ ప్రథమ స్థానంలో నిలవగా గాదిరాజు లక్షిత 97.6 శాతం మార్కులు, భూపతిరాజు మన్విత 97.4 శాతం మార్కులు సాధించినట్లు చెప్పారు. ఇంటర్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించగా ముదుండి హసిని ఎంపీసీలో 430 మార్కులు, ముదునూరి పుష్పిత వల్లి ఎంపీసీలో 397 మార్కులు, వేగేశ్న ప్రజ్ఞశ్రీ ఎంబైపీసీలో 396 మార్కులు సాధించినట్లు తెలిపారు. పరీక్షా ఫలితాలు మంచి మార్కులు సాధించిన విద్యా ర్థులు, వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులను అభినందించారు.

టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి

భీమవరం: టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడారు. టిడ్కో ఇళ్ల నిర్మాణం ప్రారంభించి, దశాబ్ద కాలం గడిచినా నేటికీ లబ్ధిదారులకు గృహాలు అందించలేదని విమర్శించారు. డ్రెయినేజీ సౌకర్యం లేదని, మంచి నీరు సరిగా అందట్లేదని పట్టణంలోని శివారు ప్రాంతాలకు మంచినీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు ఎం.వైకుంఠరావు, సీహెచ్ వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు, డోకల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కర్రతో దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు

అత్తిలి: మండలంలోని మంచిలి గ్రామంలో జరిగిన శ్రీపల్లాలమ్మ అమ్మవారి జాతరలో వ్యక్తిపై కర్రతో దాడిచేసిన నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి ప్రేమరాజు బుధవారం తెలిపారు. ఈనెల 13వ తేదీ రాత్రి మంచిలి గ్రామంలో శ్రీపల్లాలమ్మ అమ్మవారి జాతర ఊరేగింపులో జరిగిన ఘర్షణలో పడాల హేమదుర్గ సురేష్‌పై అదేగ్రామానికి చెందిన దిలీప్ కర్రతో కొట్టడంతో రక్తస్రావం అయింది. చికిత్స నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పి ప్రేమరాజు చెప్పారు.

పంచాయతీ అధికారుల ఆదేశాలతోనే విద్యుత్ తొలగింపు

కాళ్ల: లంక రోడ్‌లో ఉన్న ఇళ్లకు కరెంటు తొలగింపు పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకే చేసినట్లు విద్యుత్‌శాఖ ఏఈ రాంబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దళితుల ఇళ్లకు కరెంటు తొలగింపు అన్యాయం అనే శీర్షికన సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ వార్తపై విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వివరణ ఇచ్చారు. పంచాయతీ అధికారులు లంక రోడ్‌లో ఇళ్లు పడగొడుతున్నామని 2024 డిసెంబర్ 27న పంచాయతీ అధికారుల సమక్షంలో 9 సర్వీసులకు విద్యుత్ సరఫరా నిలిపివేశామన్నారు. భద్రతా కారణాల దృష్ట్యా విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఈ సర్వీసులకు స్తంభాల నుంచి విద్యుత్ సరఫరా తొలగించామన్నారు. ఆ నివేదికను పీజీఆర్ఎస్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు నివేదించామని వివరించారు.

మీరు చేసిన అభివృద్ధి ఏది ?

ఉండి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉణుదుర్రులో జరిగిన అభివృద్ధిని కూటమి ప్రభుత్వంలో తామే చేశామని ఉప సభాపతి, ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు చెప్పుకోవడం సిగ్గు చేటని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి, న్యాయవాది జి.సుందర్ కుమార్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా పత్రికా ప్రటనలో పలు అంశాలు మాట్లాడారు. ఉణుదుర్రు గ్రామంలో పైప్‌లైన్, హెల్త్ సెంటర్, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలన్నీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే చేశారన్నారు. కానీ మంగళవారం వాటిని ప్రారంభించి కూటమి ప్రభుత్వంలో ఉణుదుర్రులో రూ.కోటి అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని ఎద్దేవా చేశారు. గ్రామంలో మంచినీటి సమస్య ఉందని ఒంటిపూట మాత్రమే నీటిని పంచాయతీ వారు సరఫరా చేస్తున్నారని అన్నారు. ఎస్సీ ఏరియాలో మౌలిక వసతులు లేవని రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, ఆక్వా చెరువుల వలన నీరు కలుషితమవుతుందన్నారు. పలు సమస్యలతో గ్రామస్తులు సతమతమవుతున్నారని వాటిని పరిష్కరించాలని సుందర్‌కుమార్ విమర్శించారు.

'కిశోరి వికాసం' పై ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పాలకోడేరు: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కుముదవల్లిలో పాఠశాలకు సంసిద్ధత కార్యక్రమం, శృంగవృక్షం గ్రామంలో కిశోర్ వికాసం కార్యక్రమాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కుముదవల్లి కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.పార్వతి మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ మహిళా సాధికారతకు విశేషమైన కృషి చేస్తున్నామన్నారు. అయిదేళ్ల లోపు చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందిస్తూ, వారి అభిరుచిని బట్టి అక్షరాలు నేర్పిస్తూ, పాఠశాలకు వెళ్లేలా సంసిద్ధత చేస్తున్నామన్నారు. అలాగే యుక్త వయసులో ఉన్న కిశోర బాలికలకు పౌష్టికాహారంతో పాటు పర్యావరణం, సైబర్ నేరాలు, లైంగిక విద్యపై ఋతు క్రమం సమయంలో పాటించాల్సిన ఆరోగ్య సూత్రాల గురించి, పాఠశాలలకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రమణ కుమార్ అంగన్‌వాడీ టీచర్లు జి.జెమీమా, సీహెచ్ కనకదుర్గ, జి.సుబ్బలక్ష్మి, టి.అలీస్‌మేరి, తదితరులు పాల్గొన్నారు.

ఓవర్ లోడుతో విద్యుత్ పరికరాలు ధ్వంసం


ఓవర్ లోడుతో కాలిపోయిన ఏసీ


అర్ధ రాత్రి దగ్ధమవుతున్న ట్రాన్స్‌ఫార్మర్

ఆకివీడు: గత కొన్ని రోజులుగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఓల్టేజ్ సమస్య తీవ్రంగా ఉంది. లోఓల్టేజ్‌తో విద్యుత్ బల్బులు డిమ్ అయిపోయి, ఫ్యాన్లు, ఏసీ తిరగని పరిస్థితి నెలకొంది. కొద్ది సేపటికే మళ్లీ యథాస్థితికి చేరుకుంటున్నాయి. అయితే మంగళవారం అర్ధ రాత్రి సమయంలో స్థానిక మాదివాడలోని కలెక్టర్ వారి వీధిలో ఓవర్ లోడుతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు వెలువడ్డాయి. ఒక్కసారిగా మంటలు ఎగిసిపడటంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. అదే సమయంలో ఇళ్లలోని ఇన్వర్టర్, బల్బులు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు, ఏసీలు షార్టు సర్క్యూట్‌కు గురై కాలిపోయాయి. అర్ధ రాత్రి సమయంలో జరిగిన సంఘటన వల్ల విద్యుత్ శాఖ అధికారులు వచ్చి కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో మరో పాత ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చారు. తెల్లవారు జామున ఈ పాత ట్రాన్స్‌ఫార్మర్ కూడా పెద్ద శబ్దం వచ్చి పేలిపోయింది. ఉదయం 11.30 వరకూ విద్యుత్ సరఫరా లేదు. దీనిపై ట్రాన్స్‌కో ఏఈ రత్నాకర్ మాట్లాడుతూ ఓవర్ లోడు సమస్య తీవ్రంగా ఉందని చెప్పారు. సామర్థ్యానికి మించి విద్యుత్ వాడకం ఉండటంతో ఈ సమస్య తలెత్తుతోందన్నారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు సరైన స్థలాలు సమకూర్చడం లేదన్నారు. ఓవర్ లోడు చార్జీలు చెల్లిస్తే ఆ ప్రాంతంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరుకు ప్రభుత్వానికి రాస్తామన్నారు. పట్టణంలోని జవహర్‌పేట, పెదపేట, సమతానగర్, తదితర ప్రాంతాల్లో లోఓల్టేజ్ సమస్య ఉందని చెప్పారు. మాదివాడలో ట్రాన్స్‌ఫార్మర్లు దగ్ధం కావడంతో విద్యుత్ శాఖకు సుమారు రూ.8 లక్షల పైబడి నష్టం వాటిల్లిందని చెప్పారు. వినియోగదారులకు కూడా తీవ్ర నష్టం వచ్చిందన్నారు.

ఉపాధి హామీ పనులను పెంచాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

భీమవరం అర్బన్: ఉపాధి హామీ పనులు ఏడాదికి 200 రోజులు పెంచి కూలీ రూ.600 ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని నాగిడిపాలెం గ్రామంలో బుధవారం ఉపాధి కూలీలను సీఐటీయూ నాయకులు కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ కూలీలతో ఈ నెల 20న చేపట్టబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమ్మెను జయప్రదం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గిస్తూ నీరుగారుస్తుందన్నారు. కార్యక్రమంలో నాగిడి గోవిందమ్మ, పూర్ణచంద్రరావు, తిరుమాని శ్రీరాములు, కర్రి పర్లమ్మ, పొన్నమండ గోపయ్య, వాతాడి రామారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుని సన్నిధిలో భక్తుల రద్దీ


ధ్వజ స్తంభం ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కాళ్ల: మండలంలోని జక్కరంలో శిథిలావస్థకు చేరిన శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణం చేయాలనే మాజీ ఎమ్మెల్యే, క్షత్రియ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దివంగత పాతపాటి సర్రాజు కల నెరవేరిందని పలువురు వ్యాఖ్యానించారు. ఓం నమః శివాయ అంటూ జక్కరం గ్రామం బుధవారం శివ నామస్మరణతో మారుమోగింది. మండలంలోని జక్కరంలో దశాబ్దాల చరిత్ర కలిగిన శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం శిథిలావస్థకు చేరడంతో నూతన ఆలయ నిర్మాణానికి దేవదాయ ధర్మదాయ శాఖ, గ్రామ పెద్దలు, పూనుకొని అత్యంత సుందరంగా దేవాలయాన్ని నిర్మించారు. ఈ ఆలయంలో విగ్రహాల పునఃప్రతిష్ఠ సందర్భంగా రెండు రోజుల నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహిస్తున్నారు. శ్రీరాజరాజేశ్వరి సమేత శ్రీరామలింగేశ్వరస్వామి, విఘ్నేశ్వరస్వామి, సూర్యనారాయణమూర్తి, శ్రీ విష్ణుమూర్తి నూతన విగ్రహాలు ప్రతిష్ఠ, ధ్వజస్తంభం ప్రతిస్థాపన, కుంభాభిషేకం, శిఖర ప్రతిష్ఠ, శివుని విగ్రహావిష్కరణ కార్యక్రమాలు కన్నుల పండువగా బుధవారం నిర్వహించారు. నూతన విగ్రహాలకు వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఆలయం వద్ద ధ్వజస్తంభం ఏర్పాటు అత్యంత వైభవపేతంగా జరిపారు. ఉండి ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజు, కొటికలపూడి గోవిందరావు, జుత్తుగ నాగరాజు, ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాత పాటీ వాసు, కోపల్లె సొసైటీ మాజీ అధ్యక్షుడు నంద్యాల రామరాజు, ఆలయ చైర్మన్ నంబూరి సతీష్, పాతపాటీ యుగంధర్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలి


ఆచంటలో కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని చూపుతున్న కౌలు రైతు సంఘ నాయకులు

పెనుగొండ: జిల్లాలో ధాన్యం కొనుగోలు టార్గెట్‌లు పూర్తయ్యిపోయిందంటూ కొన్ని ప్రాంతాల్లో మిల్లర్లు, రైతు సేవా కేంద్రాలు ధాన్యంకొనుగోలు చేసే పరిస్థితి లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ధాన్యం కొనుగోలు సమస్యలపై పాలకొల్లు, పోడూరు, ఆచంట మండలాల్లో పర్యటించి రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. జిల్లాలో ఇంకా లక్షా యాభైవేల మెట్రిక్ టన్నుల వరకూ ధాన్యం ఉందన్నారు. అనేక చోట్ల మిల్లర్లు టార్గెట్ అయిపోయిందని ధాన్యం దింపుకోవడం లేదన్నారు. ఓ పక్క వాతావరణం బాగోలేక పోవడంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంట అయినకాడికి అమ్ముకోవాల్సి వస్తుందని వాపోయారు. 1153 రకం ముక్కై పోతుందని మిల్లర్లు దింపుకోమని, లేదంటే బస్తాకు 5 కేజీలు ఇవ్వాలని రైతులను మోసం చేస్తున్నారని తెలిపారు. వాతావరణం బాగోలేని పరిస్థితుల్లో టార్గెట్‌తో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని, సమస్యలపై జిల్లా సివిల్ సప్లయ్ డీఎం శివరామ ప్రసాద్‌తో మాట్లాడామన్నారు. కార్యక్రమంలో కౌలు రైతులు కొండేటి సత్యనారాయణ, కొండేటి సురేష్, గుబ్బల నాగరాజు, కడలి శేకర్‌చ కొండేటి వెంకటేశ్వరరావు, యాండ్ర మంగ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి


ఆచంటలో వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

పెనుగొండ: లేబర్ కోడ్‌లతో కార్మికులు ఉద్యోగులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, వెంటనే వీటిని రద్దు చేయాలని కౌలు రైతుల సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. బుధవారం ఈ నెల20 న చేపట్టబోయే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ ఆచంటలో వాల్ పోస్టర్లు విడుదల చేశారు. అనేక దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బడా కార్పొరేట్లకు, బహుళ జాతి కంపెనీలకు సహకరించేలా కార్మికులకు అండగా ఉన్న అనేక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చి కార్మికుల నాశనానికి కేంద్ర ప్రభుత్వం పూనుకోవడం అతి దారుణమన్నారు. ప్రజాస్వామ్య దేశంలో కార్మికులు, కర్షకలకు రక్షణ లేకుండా పోతుందన్నారు. గతంలో కార్మికులు అనేక పోరాటాలు చేసిన తరువాత వ్యవసాయ నల్ల చట్టాలను వెనక్కి తీసుకున్నారన్నారు. అదే ఉత్సాహంతో ఈనెల 20న జరుగుతున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కోట్లాది మంది కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి వచ్చేలా ఉద్యమాలు చేపట్టాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బండి రంగారావు, భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు దాసిరెడ్డి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కేతా నాగాంజనేయులు, సిర్రా నరసింహామూర్తి, చోప్పల మోహన్, మన్నే బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ముస్లిం కుటుంబాల పిల్లలకు ఖత్నా


అంజుమన్ భవనంలో ఖత్నా కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం: స్థానిక అంజుమన్ సంఘ ఆధ్వర్యంలో బుధవారం పేద ముస్లిం కుటుంబాల్లోని పిల్లలకు ఇస్లాం సంప్రదాయల్లో ముఖ్యమైన ఖత్నా(ఒడుగులు) కార్యక్రమం బుధవారం చేయించారు. ఈ సందర్భంగా అంజుమన్ సంఘ అధ్యక్షుడు షేక్ బులిమస్తాన్ మట్లాడుతూ నియోజకవర్గంలోని పేద ముస్లిం కుటుంబాల్లోని పిల్లలకు ఈ కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. డబ్బులు ఖర్చు చేసి ఈ కార్యక్రమం నిర్వహించుకోలేని వారికి ఉపయోగంగా ఈ కార్యక్రమం గత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ సంఘ నాయకులు ఎండీ దావూద్‌ఖాన్, బడేవలీ, మౌలాలీఖాన్, ఖాజా, ఆలీ, ఆలీషా తదితరులు పాల్గొన్నారు.